నగరానికి పదివేల విదేశీ పక్షులు

బీఆర్ఎస్ ఆలోచనలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటున్న కొత్వాల్‌గూడ ఎకో పార్క్

హైదరాబాద్‌కు రానున్న ఆస్ట్రేలియా, ఆఫ్రికా, చైనా, అమెరికా దేశాలకు చెందిన 19 జాతుల పక్షులు

ఇంటర్నేషనల్ పక్షుల కేంద్రానికి గతంలో బీఆర్ఎస్ ప్రణాళికలు

ఎట్టకేలకు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు కదిలిన హెచ్ఎండీఏ యంత్రాంగం

సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ వేదికగా ప్రపంచ స్థాయి ఐవరి సెంటర్‌ను నెలకొల్పాలని బీఆర్ఎస్ ప్రణాళికలు ఎట్టకేలకు కార్యరూపంలోకి వచ్చాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో విదేశీ పక్షుల కేంద్రాన్ని ప్రారంభించి పర్యాటక ప్రాంతంగా కొత్వాల్‌గూడ ఎకో పార్క్ పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు హెచ్ఎండీఏ యంత్రాంగం కదిలింది. ఈ క్రమంలో ప్రపంచంలోని 19 ప్రాంతాలకు చెందిన వివిధ జాతులకు చెందిన పదివేల విదేశీ పక్షులను హైదరాబాద్‌కు తీసుకురానున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నిర్మాణ పనులు చివరిదశలో ఉండగా పక్షులను దిగుమతి చేసుకునేందుకు హెచ్ఎండీఏ అధికారులు సన్నాహాలు ప్రారంభించారు ఈ క్రమంలో ఆస్ట్రేలియా అమెరికా ఆఫ్రికా, చైనా వంటి దేశాలకు మాత్రమే పరిమితమైన పక్షి జాతులను కొత్వాల్‌గూడ ఎకో పార్కుకు తరలించనున్నారు. హైదరాబాద్ వేదికగా ప్రపంచంలోని అతిపెద్ద ఐవరీలలో ఒకటిగా కొత్వాల్‌గూడలోని ఎకో పార్క్ నిలువనుంది. ఆస్ట్రేలియా, పెరూ, అర్జెంటీనా, న్యూజిలాండ్ యునైటెడ్ స్టేట్స్, చైనా వంటి దేశాల నుంచి 10,000 విదేశీ పక్షులు కొలువు దీరనున్నాయి. అప్పటి సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా హైదరాబాద్ కేంద్రంగా వరల్డ్ క్లాసు టూరిజం స్పాట్‌గా కొత్వాల్‌గూడ ఎకో పార్క్‌ను అభివృద్ధి చేయాలని హెచ్ఎండీఏ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. హెచ్ఎండీఏ 19 రకాల జాతులకు చెందిన విదేశీ పక్షులను సేకరించనుంది. ఆస్ట్రేలియా, పెరూ, అర్జెంటీనా, న్యూజిలాండ్, యునైటెడ్ స్టేట్స్, చైనా, జపాన్ , నికోబార్, ఇండోనేషియా వంటి దేశాల్లో మనుగడ సాగించే వివిధ రకాల పక్షులను హైదరాబాదుకు తీసుకురానున్నారు. ఈ క్రమంలో అక్కడి పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా హైదరాబాద్ ఐవరి కేంద్రాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఈ జాబితాలో బ్లూ, గోల్డ్ మకావ్, గ్రీన్ వింగ్ మకావ్, స్కాలర్ మకావ్, కాక్టోస్, అమెజాన్ పారెట్, ఎక్లెక్టస్ పారెట్, కోనేరస్, కాక్ టైల్స్, బర్గీస్, డౌస్, ఫించేస్, రెయిన్బో లోరికేట్స్ , తురకో, క్వాకర్ పారాకీట్స్, మాండ్రీన్ డక్స్, ఆఫ్రికన్ గ్రే ప్యారెట్స్, గ్రాస్ పారా కిట్స్ వంటి జాతులకు చెందిన పదివేల పక్షులు హైదరాబాద్‌కు రానున్నాయి.

ఆరెకరాల్లో విదేశీ పక్షులు..

ఆరెకరాల విస్తీర్ణంలో హెచ్ఎండీఏ అభివృద్ధి చేస్తున్న కొత్వాల్‌గూడ ఎకో పార్కులో విదేశీ పక్షులు అందుబాటులోకి రానున్నాయి. పర్యావరణం, అరుదైన, అంతరించిపోతున్న వన్యప్రాణుల చట్టాలకు లోబడి నగరానికి తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎన్డేంజర్డ్ స్పీసెస్ , వన్యప్రాణి సంరక్షణ నిపుణుల ధ్రువీకరణ తర్వాత ఐవరి సందర్శనకు వీలు కలగనుంది. జూనోటిక్ వ్యాధులు, అంటు వ్యాధులు, ఇతర పరాన్నజీవులు ఆయా పక్షుల్లో లేవని నిర్ధారించుకున్న తర్వాతే హైదరాబాద్‌లో ఐవరి కేంద్రానికి తరలించనున్నారు. అప్పటివరకు 45 రోజుల పాటు నిపుణుల పర్యవేక్షణలో ఉంటాయని అధికారులు తెలిపారు. 45 రోజుల తర్వాత పక్షుల ఆరోగ్య స్థితిగతులు అనగా.. హైదరాబాద్ వాతావరణ పరిస్థితులకు నిలబడిన పక్షులను మాత్రమే ఐవరిలో సంరక్షిస్తామని అధికారులు వివరించారు.

గిన్నీస్ రికార్డే లక్ష్యంగా..

102 సార్లు రక్తదానం చేసిన వెంకటేశ్వర్‌రెడ్డి

రక్తదానం చేస్తున్న మేక వెంకటేశ్వర్‌రెడ్డి

రాజాపేట, నవంబర్ 3 : మండలంలోని నెమిలె గ్రామానికి చెందిన మేక వెంకటేశ్వర్‌రెడ్డి రక్తదానంలో గిన్నీస్ రికార్డు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇందుకోసం 400 సార్లు రక్తం దానం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇప్పటికే 102 సార్లు పూర్తి చేశాడు. ఈ క్రమంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో రక్తదానం చేశాడు. ఆయన గాంధీ, ఉస్మానియా, కిమ్స్, యశోద దవాఖానలతో పాటు పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో 102 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. 45ఏండ్ల వయసున్న ఆయన ఇప్పటికి 68 సార్లు రక్తదానం, 36 సార్లు ప్లేట్‌లెట్స్ ఇచ్చినట్లు చెప్పాడు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం 65 ఏండ్ల వయస్సు వరకు రక్తదానం చేయవచ్చని, 400 సార్లు రక్తదానం చేసి గిన్నీస్ రికార్డు సాధించాలనే అకాంక్ష ఉన్నట్లు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి : బీఆర్ఎస్

వలిగొండ, నవంబర్ 3 : ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నామమాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అధికారులు ఇంకా ఎందుకు కొనడంలేదని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి అన్నదాతలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు

చౌటుప్పల్, నవంబర్ 3 : పట్టణంలోని రాంనగర్‌లో సదర్ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో దున్నపోతుల ర్యాలీ నిర్వహించారు. వాటి విన్యాస్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాయకులు పాక చిరంజీవి, మొగుదాల రమేశ్‌గౌడ్, కంచరకుంట్ల రాంరెడ్డి, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

'గ్రామీణ వారోత్సవాలను విజయవంతం చేయాలి'

గ్రామీణ వారోత్సవాల పోస్టర్ విడుదల చేస్తున్న ఈషా ఫౌండేషన్ సభ్యులు

ఆత్మకూరు(ఎం), నవంబర్ 3 : భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్న 16వ గ్రామీణ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఫౌండేషన్ సభ్యులు శశాంక్, కృష్ణవేణి కోరారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం వారోత్సవాల ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నీడ్స్ స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు కానుగంటి శ్రీశైలం, వలంటీర్లు అరుణ, శ్యామల, శ్రీలత, సరిత పాల్గొన్నారు.

మాదాపూర్‌లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం వైష్ణవి నాట్య సెంటర్ గురువర్యులు డాక్టర్ వైష్ణవి సాయినాథ్ శిష్య బృందంచే భరతనాట్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. పుష్పాంజలి, అలరిపు, జతిస్వరం, శివతాండవం, కళింగనర్తన, రామస్తుతి, శివశక్తి స్తుతి, కృష్ణస్తుతి, జావళి.. అంశాలను లలితా ఆనంద్ (హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ సతీమణి), మీరా, మానస, కాత్య, దేవమని, లాస్య, తపస్య, వకుళ శ్రీఓం, అలీన, అయిజా ప్రదర్శించి మెప్పించారు.

సాహిత్య సేవా రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించాలి

పురస్కారాలను అందజేస్తున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ టి.రజని తదితరులు

చిక్కడపల్లి,నవంబర్ 3: కళా సాహిత్య సేవా రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ టి.రజని అన్నారు. లయన్ ఆరిగపూడి కృష్ణకుమారి సేవలు అజరామరమని పేర్కొన్నారు. ఆరిగపూడి పూర్ణచంద్ర రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి బిక్కి కృష్ణ అధ్యక్షతన ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్వర్గీయ కృష్ణకుమారి, స్మారక జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ టి.రజని హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ కుడూరి, భగీరథ, గీతాంజి, రామచంద్రనాయక్, శ్రీనివాస్, కె.అల్పనజ్యోతి రాంబాబు,శ్రీరాం దత్తి, డాక్టర్ రఘు, విజయ్ భాస్కర్, లయన్ కృష్ణ కుమారిలకు స్మారక జాతీయ పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్.వి. యూ పూర్వ ఉపాధ్యక్షుడు పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, ఇన్‌కం ట్యాక్స్ మాజీ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప, రిటైర్డ్ ఐజీ బి.వి.రమణ కుమార్, తెలుగు వన్ ఛానల్ ఎం.డి. రవిశంకర్, ఆంధ్రప్రభ ఎడిటర్ వై.ఎస్. ఆర్.శర్మ, ప్రముఖ నవలాకారులు, భగీరథ కవులు డాక్టర్ జెల్ది, విద్యాధర్, నాలేశ్వరం శంకర్ పాల్గొన్నారు.

హద్దులెక్కడ..!

- నాలుగు చెరువులపై హైడ్రా కసరత్తు
- పైలట్ ప్రాజెక్ట్ కోసం మ్యాపుల సేకరణ
- పాతమ్యాపులతోనే సర్వే ప్రక్రియ

సిటీబ్యూరో, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): చెరువుల పునరుజ్జీవం, సుందరీకరణకు సంబంధించిన పైలట్ ప్రాజెక్ట్‌పై హైడ్రా దృష్టిపెట్టింది. నాలుగు చెరువుల విస్తీర్ణం వివరాలను సేకరిస్తోంది. ప్రస్తుతం ఎంత ఉన్నదన్న దానిపై నేషనల్ రిమోర్ట్ సెన్సింగ్ సెంటర్ ఎన్ఆర్ఎస్‌సీ సాయం తీసుకుంటోంది. హైడ్రా పరిధిలో ఉన్న చెరువుల ఎఫ్టీఎల్, బఫర్‌జోన్లకు సంబంధించి హద్దులను నిర్ణయించనుంది. ఇందులో భాగంగా ముందు తన పైలట్‌ప్రాజెక్ట్ నల్లచెరువు, ఎర్రగుంట చెరువు, అప్పచెరువు, సున్నం చెరువుల విస్తీర్ణం ఎంత , గతంలో ఎలా ఉండేవి.. ఇప్పుడెలా ఉన్నాయి అనే అంశాలపై సమగ్ర వివరాలు తీసుకుంటోంది. హైడ్రా అభ్యర్థన మేరకు ఎన్ఆర్ఎస్‌సీ ఇటీవల 56 చెరువుల పటాలను అందజేసింది. ఇందులో ఉన్న వివరాలపై సమగ్రంగా పరిశోధన జరిపి తనకు పూర్తి వివరాలు ఇవ్వాలంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంస్థను కోరారు. 1979-2023 ఏళ్ల మధ్య చెరువులు ఏవిధంగా ఆక్రమణలకు గురయ్యాయో ఎన్ఆర్ఎస్‌సీ మ్యాపులతో సహా వివరించింది. దీంతో ఆక్రమణల వివరాలతో సహా విస్తీర్ణంపై ఆయా మ్యాపులను పక్కాగా రూపొందించి ఇస్తే తాము తీసుకుంటామని రంగనాథ్ గతంలోనే సెంటర్‌కు చెప్పారు. పైలట్‌ప్రాజెక్ట్‌గా నాలుగు చెరువులను పునరుజ్జీవం, సుందరీకరణ చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో వీటికి సంబంధించిన మ్యాపులను త్వరగా ఇవ్వాలని ఎన్ఆర్ఎస్‌సీని రంగనాథ్ ఇటీవల కోరారు. బెంగళూరు వెళ్లి వచ్చిన వెంటనే ఈ మ్యాపుల ఆధారంగా నాలుగు చెరువుల హద్దులను ఫైనల్ చేస్తామని హైడ్రా బృందంలో ఒక అధికారి చెప్పారు.

పాత మ్యాపులతోనే సర్వే ప్రక్రియ

ప్రస్తుతం ఓఆర్ఆర్ లోపల మిగతా చెరువుల సర్వే మాత్రం పాత మ్యాపుల ఆధారంగానే జరుగుతోంది. హైడ్రా అధికారులు బృందాల వారీగా ఒక్కో మండలంలో సర్వే నిర్వహిస్తున్నారు. అధికారుల బృందం 45 ఏళ్ల డేటా ఆధారంగా బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ నిర్ణయిస్తున్నారు. చెరువులకు సంబంధించి ఫుల్ ట్యాంక్ లెవల్‌తో పాటు గరిష్టంగా నీరు విస్తరించే ప్రాంతం మ్యాగ్జిమమ్ వాటర్ స్ప్రెడ్ ఏరియాను తేల్చనున్నారు. మ్యాప్స్, ల్యాండ్ యూజ్ సర్వే నంబర్లతో సహా సమాచారం ఇచ్చే క్యాడస్ట్రల్ మ్యాప్స్ ఆధారంగా 45 ఏళ్లలో పూర్తిస్థాయిలో చెరువు నీరు విస్తరించిన తీరుపై సమాచారం సేకరిస్తున్నారు. ఇందుకోసం ఎన్ఆర్ఎస్‌సీ, రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాల డేటాను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. సర్వే సమయంలో హద్దులు చెరిగిపోయి.. కొన్నింటికీ హద్దులు పూర్తిగా లేకుండా ఉంటున్నాయని వాటిని ఫైనలైజ్ చేయడం కష్టమవుతోందని అధికారులు చెప్పారు. మిషన్ కాకతీయ సమయంలో చెరువుల పూడికతీత, గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, పునర్నిర్మాణం తెచ్చిన నేపథ్యంలో అప్పటి రికార్డులను కూడా ఆధారంగా చేసుకొని కొన్ని చెరువుల హద్దులు ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది.

ఎన్ఆర్ఎస్‌సీ సహకారం..!

హైదరాబాద్‌లో ఎన్ఆర్ఎస్‌సీ ఇప్పటివరకు 56 చెరువులను అధ్యయనం చేసింది. గత 45 ఏండ్లలో ఆయా చెరువుల వాస్తవ విస్తీర్ణం 9,970.70 ఎకరాలు కాగా.. ప్రస్తుతం ఉన్న విస్తీర్ణం 3975.92 ఎకరాలు. ఆక్రమణకు గురైంది 5,994.77 ఎకరాలు అని వాస్తవ విస్తీర్ణంలో అరవైశాతం ఆక్రమణలకు గురైనట్లు తేల్చారు. వీటన్నిటి విషయంలో ప్రస్తుతం హద్దులు నిర్ణయించడం హైడ్రాకు పెద్ద సవాల్‌గా మారుతోంది. ముందుగా పైలట్ ప్రాజెక్ట్‌లోని నాలుగు చెరువుల హద్దులను నిర్ణయించి వాటిని సుందరీకరించి ప్రభుత్వానికి చూపించిన తర్వాత మిగతా వాటి విషయంలో నిర్ణయం తీసుకుంటామని హైడ్రా బృందం చెబుతోంది. హైడ్రా ఎంపిక చేసుకున్న నాలుగు చెరువుల్లో హైడ్రా, హెచ్ఎండీఏ రికార్డుల ప్రకారం కూకట్‌పల్లి నల్లచెరువు వాస్తవ విస్తీర్ణం 27 ఎకరాలు కాగా ప్రస్తుతం ఉన్నది 20 ఎకరాలు. నల్లచెరువులో బఫర్‌జోన్, ఎఫ్టీఎల్‌కు సంబంధించి 3 ఎకరాల్లో పలు నిర్మాణాలను హైడ్రా కూల్చేసింది. సున్నం చెరువులో కూడా ఆక్రమణలంటూ కూల్చివేతలు జరిపిన విధానం పై హైడ్రాకు స్థానికంగా తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ల నిర్ధారణ చేయకుండా ఎలా కూల్చివేస్తారంటూ కొందరు హైడ్రాను నిలదీశారు. ఎర్రగుంట చెరువు, అప్పచెరువు వద్ద కూడా ఇదే పరిస్థితి ఉండటంతో పక్కాగా హద్దుల నిర్ణయం తర్వాతే తమ ప్రాజెక్ట్‌ను మొదలు పెట్టాలని హైడ్రా కమిషనర్ భావిస్తున్నారు. ఎన్ఆర్ఎస్‌సీ నుంచి ఈ నాలుగు చెరువులకు సంబంధించిన మ్యాపులు తీసుకుని వాటి ద్వారా హద్దులు నిర్ణయించి తర్వాత పునరుజ్జీవం, సుందరీకరణ చేయాలని నిర్ణయించినట్లు హైడ్రా అధికారి చెప్పారు. అయితే గతంలో ఈ చెరువుల పరిస్థితిని, ఆక్రమణలు ఎప్పుడెప్పుడు జరిగాయో పూర్తిగా వివరాలతో మ్యాప్స్ వచ్చిన తర్వాతే వాటి ఆధారంగా హద్దులను నిర్ణయించి పనులు చేపడతారు. ప్రస్తుతం ఈ నాలుగు చెరువులపైనే హైడ్రా సీరియస్‌గా దృష్టి పెట్టింది. చెరువుల మ్యాపులు వస్తే సర్వే సులభంగా జరుగుతుందని కమిషనర్ భావిస్తున్నారు.

వైద్యం అందించడంలో దవాఖానల పాత్ర కీలకం

కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ ఎన్ రవీంద్ర నాయక్

మాదాపూర్, నవంబర్ 3: వైద్యం అందించడంలో ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల పాత్ర కీలకమని రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ ఎన్.రవీంద్ర నాయక్ అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన థానాకాన్ 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ ఎన్.రవీంద్ర నాయక్ హాజరై నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్. రవీంద్రనాయక్ మాట్లాడుతూ... వైద్యం అందించడంలో ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల పాత్ర కీలకమన్నారు. రాష్ట్రం మెడికల్ టూరిజంగా మారిందని, దేశ విదేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి వైద్యం చేయించుకుంటున్నట్లు చెప్పారు. దవాఖానల పరిశ్రమలోని వివిధ రంగాల్లో జాతీయ నిపుణులు తమ నైపుణ్యతలను టీహెచ్ఏఎన్ (థానా) రాష్ట్ర అధ్యక్షుడు, డాక్టర్ వీఎస్ రావు వివరించారు. వినియోగదారుల ఫోరం, చిన్న దవాఖానల, ఆరోగ్యం మొదలైన అనేక హాట్ టాపిక్‌లపై ప్యానెల్ చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి, డాక్టర్ నౌనిహాల్, ఆర్గనైజింగ్ కమిటీ కో చైర్మన్, డాక్టర్ ఎల్. సురేశ్ గౌడ్‌లతో పాటు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ ఎలెక్ట్ అధ్యక్షుడు, డాక్టర్ దిలీప్ భనుషాలి, ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, డాక్టర్ కాలి ప్రసాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల డీఎంహెచ్ఓలు, డాక్టర్ వెంకటేశ్వరరావు, రాఘునాథ స్వామి తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి కులగణనపై రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య సదస్సులు

ఖైరతాబాద్, నవంబర్ 3 : సమగ్ర కులగణనపై ఈ నెల 6 నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య సదస్సును నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చైతన్య సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణనలో 136 బీసీ కుల సంఘాలు, మేధావులు, విద్యార్థి, యువజన, మహిళలు, ఉద్యోగులు భాగస్వాములయ్యేలా ఈ చైతన్య సదస్సులు ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రశ్నావళిలో బీసీలకు కొన్ని సందేహాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయాలన్నారు. కులగణనపై ప్రత్యేకంగా నోడల్ ఏజెన్సీని నియమించాలని, సచివాలయంలో టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంచాలని, రిటైర్డ్ జడ్జిలు, ఐఏఎస్‌లు, ప్రొఫెసర్లు, మేధావులతో సలహా మండలి ఏర్పాటు, ప్రభుత్వం ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ గణేశ్ చారి, శ్రీనివాస్, బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం డిజైనర్ స్టూడియోను ప్రారంభించిన సినీనటి ప్రణీత సుభాష్

సిటీబ్యూరో, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో సరికొత్త స్వయం డిజైనర్ స్టూడియోను ఖాజాగూడలో సినీనటి ప్రణీత సుభాష్ ఆదివారం ప్రారంభించారు. యమునా బధిత ఏర్పాటు చేసిన ఈ ఫ్లాగ్ షిప్ స్టోర్‌ను ప్రారంభించిన సందర్భంగా ప్రణీత మాట్లాడుతూ.. ఒకప్పుడు డిజైనర్ దుస్తులకు సంబంధించి హైదరాబాద్‌లో డిజైనర్లు అందుబాటులో ఉండేవారు కాదని, ఇప్పుడు ప్రపంచ వేదికపై హైదరాబాద్ డిజైన్లలో తన మార్క్ చాటుతున్నదన్నారు. సంప్రదాయ దుస్తులకు ఆధునీకతను మేళవిస్తూ అద్భుతంగా డిజైన్లు సృష్టిస్తున్నారని ప్రణీత అన్నారు. తాను సైతం డిజైనర్ దుస్తులను అవసరానికి అనుగుణంగా ధరిస్తానని చెప్పారు. నిర్వాహకురాలు యమున బధిత మాట్లాడుతూ.. తాను లండన్‌లో మాస్టర్స్ చేశానని, డిజైనర్ రంగంపై తనకున్న అభిలాషతో ఈ స్టోర్‌ను ఏర్పాటు చేశామన్నారు. తాము అందించే డిజైన్లు సౌకర్యవంతంగా ఉండి అందాన్ని మరింత ఇనుమడింపజేసేలా ఉంటాయని చెప్పారు. గతంలో ఆన్‌లైన్‌లో తమ సేవలు అందించామని, ఇప్పుడు స్టోర్ ద్వారా నగరవాసులకు ప్రత్యక్షంగా సేవలందిస్తామని యమున తెలిపారు.

ఎల్ఐసీ విజిలెన్స్ అవేర్నెస్ వీక్

ఎల్ఐసీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజిలెన్స్ అవేర్నెస్ వీక్ కార్యక్రమంలో పాల్గొన్న ఎల్ఐసీ జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్, ఇతర అధికారులు

సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): జీవిత బీమా సంస్థ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్ కార్యక్రమాన్ని ఆదివారం నగరంలో నిర్వహించారు. అత్యంత చిత్తశుద్ధి కలిగిన వ్యక్తిగా పేరొందిన సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి నేపథ్యంలో ప్రతియేటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎల్ఐసీ జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్ తెలిపారు. అక్టోబర్ 28న సమగ్రతా ప్రతిజ్ఞతో ప్రారంభమై ఆదివారం నిర్వహించిన వాకథాన్‌తో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమం ముగిసిందన్నారు. దారి పొడవునా అప్రమత్తతపై అవగాహన కల్పించే సందేశాలతో కూడిన ఫ్లకార్డులను ప్రదర్శించామన్నారు. అవినీతి దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే అవేర్నెస్ వీక్ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ ఆర్.సతీశ్ బాబు, మండల విజిలెన్స్ అధికారి కె.సునందన్, ఇతర అధికారులు ఎం.రవికుమార్, ఉతుఫ్ జోసెఫ్, జి.మధుసూదన్, ప్రమోద్ కుమార్ సాహూ పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి అభినందనీయం

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రమణాచారి, వంశీరామరాజు తదితరులు

ఖైరతాబాద్ : తెలుగు భాష పరిరక్షణ కోసం పలు సంస్థలు ముందుకు వచ్చి కృషి చేయడం అభినందనీయమని పూర్వ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. ఆదివారం లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో ఏర్పాటు చేసిన 'తెలుగు వెలుగు' సమాఖ్య కార్యక్రమాన్ని డాక్టర్ రమణాచారి, యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు ఆచార్య వంగపల్లి విశ్వనాథం, అధ్యక్షుడు డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, వంశీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వంశీ రామరాజుతో కలిసి ప్రారంభించారు. డాక్టర్ రమణాచారి మాట్లాడుతూ.. తెలుగు భాషకు ప్రాచీన హోదాను కల్పించేందుకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేసిన కృషి గొప్పదన్నారు. 'తెలుగు వెలుగు సొగసు' అంశంపై ఆకాశవాణి విశ్రాంత కార్యక్రమ నిర్వాహకుడు సుధామ, 'తెలుగు సాహిత్యంలో ఆణిముత్యాల్లాంటి పదాలు' అంశంపై ప్రముఖ రంగ స్థల సినీనటుడు అక్కిరాజు సుందర రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో వంశీ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్‌సుధాదేవి, యువభారతి కార్యదర్శి జీడిగుంట వెంకట్రావు, ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ రఘువీర్, డాక్టర్ జీఎన్‌కే దుర్గా, కిన్నెర సంస్థ అధ్యక్షుడు రఘురాం, మానస ఆర్ట్స్ అధ్యక్షుడు రఘుశ్రీ పాల్గొన్నారు.